# పాడి పంటల ముల్లెలు

ఆపొద్దు నిద్దరలేస్తానే ఎవుడి మొకం చూసినానో ఏం పాడో చావు కబురు చల్లంగా చెవల్లోపడె!

అది యిక్కింటిదో పక్కింటిదో పోనీ ఆ యీదిలోదో అయితే ఆకత ఏరే! 'పలకలు కొట్టా వుండేది ఎన్నోసారే?' అని యింట్లోదాన్ని అడిగి నికరంగా తెల్సుకోని మూడోసారి అయితేనే అట్టపాయ్‌నట్టు పాయ్ యిట్టొచ్చినట్టు వచ్చేయచ్చు. కాదు గీదంటే ఆ యీది కడదాకా నలగర్తో నారాయణా అని అట్టా నడ్సినట్టు నడ్సేది. ఆడొక్క సెణం నిలబడినట్టు నిలబడేది. అట్టా యిట్టా చూసినట్టు చూసేది. ఎవురూ చూళ్లేదులే అనుకుంటా కొంపకొచ్చేసేది. ఇది అట్టగాక పాయ.

మిద్దూళ్లో చావు. అది గూడా మా పోలోడి చావు!

మిద్దూరికి పోవాలంటే ఈ పొద్దుటిగ్గూడా రొండు చోట్ల దిగాల. మూడు బస్సులెక్కాల. బస్సుదిగిన చోటంతా ఎట్టలేదన్నా ఎచ్చూ తక్కవగా గెంటన్నర సేపైన్నా ఎదుర్సూస్తా నిలబడుకోవాల. చూసి చూసి కండ్లు కాయలు గాస్తా ఉంటాయి. కూసుండే దానికి ఓపిక లేక 'యింక నిలబడు కోలేమురా సామీ!' అని ఆపసోపాలు పడ్తావుంటే అప్పుడు దయతల్సినట్టు వస్తాయి ఎర్ర బస్సులు. ఆ బస్సుల్లో కూలబడ్తే యాకీలు కాకీలు యిడియిడిగా ఊడొచ్చేస్తాయి. ఎత్తుకోని పాయ్‌నోణ్ణి యముడు ఎత్తుకోనిబోతే జవుళ్లో దూరిపాయ్‌నట్టుంటింది. ఆ ఊరికి పోవాలంటే మన ఎతలు!

అట్టని పాలుమార్తే-

''పాలోడి మొకాన్నే పాలోడు పిడికిడు మట్టి ఎయ్‌కుండాబోతే యింకెవుడేస్తాడే?'' – అంటా మా బాశాలి కుండను గోకినట్టు గోకితింది.

''అప్పిటికి నువ్వు పాలిదానివి కాదో?'' అంటే–

''నీలో నేను సగంగదే? నువ్వంత మట్టేస్తే దాంట్లో సగం నేనేసి నట్టేగదా?'' అని కండ్లు యింతింత చేసుకోని దీర్గం తీస్తింది.

''అచ్చొస్తే అక్కగారికి లేకుండాబోతే గురప్పుడికి పెట్టేదానికి ఈ ఆడోళ్లకేతగు.'' అని అనుకుణ్ణానేగానీ పైకి అన్లే.సరే! యిది ఎప్పుడూ ఉండే రామాయణమే గదాని పాలోడికి పిడికిడు మట్టి ఈ చేతుల్తో ఏసేసి రావాలని ఎలబార్నా.

మిద్దూరికాడ గుంట కట్టమింద బస్సు దిగేకుందికి మద్దేణమయ్యింది.

ఎండ చెండి కొడ్తా ఉండాది.

గుంట నిండికి నీళ్లు... ఆ నీళ్లమింద అంత సందులేకుండా పచ్చదుప్పిటి పర్సినట్టు దామరాకులు... ఆకుపచ్చ దుప్పిటి మింద అద్దకం అద్దినట్టుగా తెల్లంగా దామరపూలు. ఆ గుంటను చూసేకుందికి యింకా చూడాలనిపిస్తా ఉండె ఒకప్పుడు. అట్టుణ్ణె గుంట యిప్పుడెట్టుండాది? ఆ గుంటలో గొడ్లు తాగేదానిగ్గూడా నీళ్లులేవు. ఆ బురదలో పందులు పడి పొల్లాడ్తా ఉండాయి. కంపు ముక్కు పుటాల్ను అదరగొట్తా ఉండాది. ఎటుమంటి గుంట? ఎట్టయ్ పొయిందబ్బా? అని యాదన పడ్తా ఊళ్లోకిబోతే ఊరు బిసురో మనుండాది.

ఊళ్లో పీనిగె పడుంటే ఊరెందుకిట్టుండాదే అనే అనుమానం నన్ను పట్టుకుండె.

ఊరు చూడబోతే యిట్టా! ఊరిముందర గుంట అట్టా!!–

అదే నేను చిన్న పిలగాడుగా ఉండేటప్పుడైతే–

అది అట్టా ఎగవూళ్లో గానీయండి... ఇట్టా దిగవూళ్లో గానీయండి... మిద్దూళ్లోగానీయండి ఈ మూడూళ్లల్లో ఏ యింట్లో అయినాసరే పీనిగెపడ్తే పనీపాటా వొదులుకోని ఆ మూడూళ్ల జనం ఆ యింటి ముందర్నే ఉడ్డగట్టి నిలబడుకుంటారు. ఉడ్డలు మునిగిపొయ్‌నట్లు ఏ మొకం కల్లన్నా చూడు.కత్తేటుకు నెత్తురు చుక్కవుండదు. పిలిస్తే పలికేటట్టుగా ఉంటాయి కండ్లల్లో నీళ్లు. ఎవుడి కల్లా చూసినా పీనిగె పడుండేది వాడి కొంపలోనే ఏమో అని పిస్తావుంటింది. అట్లాంటిది మా పాలోడి యింటి ముందర చడీసప్పుడు లేదు. నా మాదిర్తో దూరాబారాన్నుంచి వచ్చినోళ్లు మాత్రం పది పన్నెండు మందికి ఉంటారు. వాళ్లుగూడా ఆడొకడు యీడొకడుగా కూసుణ్ణారు. ఈ బారం ఎప్పుడు తీరబోతింది? అని ఎదురు చూస్తావుండారు.

పొయ్యింది మా చంగల్ పొండు చినయ్య కొడుకు. పెండ్లీ పెటాకులు పిలకాయిలు పీసు యిట్టా మాదిర తగలాటాలేమీ తగిలించుకోలా వాడు. బెమ్మశారిగానే చెల్లి పొయ్‌నాడు.

అందుకే అనుకుంటా అది పీనిగెబణ్ణె కొంప మాదిర అగుపళ్లా. అయితేగూడా యింట్లో పీనిగని పెట్టుకోని ఎంతసేపని ఉంటారు? పాడె. ఒంటి పాడే అనుకో. కట్టాల్నా? పాడెకట్టాలంటే ఎదురు బొంగులు కావాల్నా? వరి కసువుతో ఎంటి పేడాల్నా? గుంతలోడేదో? కాష్టానికి కట్టెకూడేసేదో? ఏదో వొగిటి చెయ్యాల్నా? పేటకు పాయ్ గూడ్డాగుసురు తెచ్చుకోవాల్నా? బిడుక్కోల్! ఆమాట అనుకుండే న్నాదుడే ఆడ అవుపించలా!

అదే ఒకప్పుడైతేనా?-

''ఇదేం పెండ్లీ పేరంటమా? ఇంటింటికి ఆకూవక్క పెట్టి పిల్సేదానికి! మల్లారమ్మని పిల్సినా రాని జల్మ. మట్టిలోకల్సి పోతావుంటే, చేతులు ముడ్సుకోని కూసుంటే అవితిందా?'' ఇట్లా ఎవుడికి వాడు అనుకుంటాడు. ఒకొర్నొకరు పిల్సే పనేలే. ఎవుడి మట్టుకువాడు. అందురు ఆడచేరి పోతారు. నువ్వాపని నేనీపని అంటా ఒకరి నొకరు పురమాయించు కుండే పనేలే. అంతా నెత్తిమింద పణ్ణెట్టుగా తలా ఒకపని ఎత్తుకుంటారు. ఆ మిందట నిల్సినచోట నిలబడేదే లే. పీనిగె ఎలబారి పొయ్యేదాకా అంతా పరుగుల మిందనే గదా?

ఒకడు పోతాడు. అది ఎవురిదైనా సరే ఎదురుగూమి. అడిగేది పెట్టేది లేదే? రొండు బొంగులు నరుక్కోని వస్తా ఉంటే... గుడ్డాగుసురు తెచ్చేదానికి కొందురు పేటకు పరుగులమింద పోతావుంటే... పాడె కట్టేవాళ్లు కట్టావుంటే... చాకలోడు రాలేదే? మంగలోడు రాలేదే? పలకలోళ్లు రాలేదే? అంటా అట్టా యిట్టా పారాడేవాళ్లు పారాడ్తాఉంటే- ఆడ చేరినోళ్లందురు ఒక యింట్లో మణుసులేనేమో అనిపిస్తా ఉండె! అందాకా ఎందుకు? ఆ ముందుటి దినందాకా ఎదురుపడ్తే ఎడమొకం పెడమొకంగా తొలిగిపోతా ఉణ్ణోళ్లయినా సరే! ఆ యింటిమింద కాకి ఈ యింటిమింద ఈ యింటిమింద కాకి ఆయింటిమింద వాలగూడ్దనుకునే వాళ్లయినా సరే! చావుకాడ మాత్రం సాదింపులు సతాయింపులు మర్సిపోతారు. అందువల్లనే ఆ ఊళ్లల్లో ఎనుకూముందూ ఎవుడూ లేకుండా ఏకాకిగా బతికినోడు గూడా ఏకాకిగా పోడే? అట్టాంటిది యిప్పుడు చూస్తావుంటే నాకే అరుసోద్దింగా ఉండాది. ఊరికత అట్ట అగ్గిబడిపోతే పొయ్యింది. పిండాకూడు వొండే దానికి కుండలు? కుమ్మరోడు కొత్తకుండలు తేవాల్నే? దివిటీ బట్టేదానికి మడివేలు రావాల్నే? మంగలోళ్లు ఏమయినారు? జంగ మాయన్ను యాడ దొంగలు తోల్నారు?

ఆడ నిలబడుకోని చూస్తావుంటే నాకంతా అయోమయంగా వుండాది.

పోనీ! యీళ్లంతా ఎట్ట బతకతా ఉండారు? ఊరిని నమ్ముకోనేగదా బతకతా ఉండేది. ఒకర్తోవొకరు సంబంధం లేకుండా ఊళ్లోవాళ్లు బతకతా ఉణ్ణా యీళ్లకు మాత్రం అందుర్తో సంబంధం ఉండాల గదా? ఏ యింట్లో ఏకార్నెం జరిగినా ఎవురొచ్చినా రాకుండా బొయ్‌నా యీళ్లు యామారే దానికి లేదే? అని నోలోనేను యాదనపడ్తా నిలబడుకోనుండా.

అయినేరోళ్ల సాంబడు ఆదోవన పోతా పోతా నన్ను చూసి నిలబడె!

''ఎప్పుడు మామా వొచ్చింది?'' అని అడిగె.

''ఒరే నీయమ్మా యికారం బట్నె నాయాలా! సావు కొచ్చినోళ్లను వొచ్చిందెప్పుడని అడగతా ఉండావే? తప్పుగదంట్రా? వొచ్చినోల్లను రావడం ఎప్పుడని అడగ్గూడదు. వాళ్ల పొయ్యేటప్పుడు సెప్పేసి పోగూడ్దురా!'' అనె ఆవునోటాయిన కొడుకు!–

''నిజిమే! నిజిమేరా! వచ్చినోళ్లను యిచారించరాదు. పొయ్యేవాళ్ల చెప్పేసి పోగూడదు. అంతదాకా బాగానే ఉండాది. అయితే యిప్పుడు పొయ్యుండాడే వాడికత? వాణ్ణి గురించి ఎవురూ ఏమీ అనుకోవాల్సిన పన్లేదా?'' అని అడిగితి.

వాడు పకపక నవ్వె!

''ఏందిరా నీ కంతా నవ్వులాటగా ఉండాదే?'' అంటే–

''ఇప్పుడెవురూ ఏమీ అనుకోలేదనిగదా నీబాద! పోనీ! అనుకోని ఏమి చెయ్యాలంటావ్? ఈ ఎండలో అందురూ యీడికొచ్చి సచ్చినాడే వాడ్తో గూడా సావాలంటావ్. అర్తం పర్తం కూడా లేని ఆలోసినగదా? సల్లబడ్తానే వొచ్చేవాళ్లు ఎట్టా వొస్తారు. వొచ్చినోళ్లు ఊరికే ఉండమన్నా ఉంటారా? ఎత్తట్టా పారేసి పోతారు''– అంటా వాడి దోవన వాడు పాయ.

''ఒరే నీపాసుగూల! ఊళ్లో పీనిగె పడుంటే ఎంత యిడ్దూరంగా మాట్లాడ్తివిరా? అసలు చీమకుట్టినంత బాదగూడా లేదే మీకు. మణుసులు ఎంత మారి పాయ్‌నార్రా?''– అని నా మణుసు పరిపరి యిదాల పోతావుండాది.

అది ఏఊళ్లో అయినా సరే! పీనిగె పడిందనుకో. అది ఏయరవన్నా కానీ ఆ పీనిగె ఎలబారి పొయ్యేదాకా ఏ యింట్లో అయినా సరే పొయ్యి రగిలేది కాదు. ఆయింటి ముందర నుంచి మణిసి అట్టా యిట్టా కదిలే వాళ్లు గాదు. కొందురు ఏడస్తా ఉంటే... కొందురు లోలోపల్నే కుమల్తా ఉంటే... అటుమంటోళ్లను వద్దని కొందురు వారిస్తా–

''ఎందుకురా ఏడ్సేది? అందురూ పోవాల్సిన వాళ్లే గదా? కాదు గీదంటే కొంచిం ఎనుకూ ముందూ. రుణానుబంధం. అది తీరిపొయ్యిందనుకో. ఆ మిందట ఎవుడి దోవ వాడ్తే గదా?'' అని కొందురు యాదాంతం మాట్లాడ్తా ఉంటే... కయ్యల్లో మడక తిరగదు. పొయ్యిమిందికి చట్టి ఎక్కదు. ఇంక గాట కట్టేసిన గొడ్డూగోదా గాట్లోటివి గాట్లోనే! ఇప్పుడు అదెంతా ఏమీలే!

చల్లబడాలంట... వచ్చేవాళ్లు ఎట్టా వస్తారంట... ఎత్తట్టా పారేస్తారంట!

మణిసి పాణమంటే ఎంత లెక్కలేకుండా పొయ్యిందబ్బా సాటి మణిసికి!

అయినేరోళ్ల సాంబడు మాత్రం అట్టా యిట్టా పోలేకుండా ఆణ్ణే ఉండె.

''మడివేలు మంగలోడు కూడా రాలేదే? ఎందుకురా!'' అని అడిగితి

''ఉంటేగద మామా వొచ్చేదానికి!''

''అయితే ఊరికి మడివేలు మంగలి కూడా లేకుండా పాయ్‌నారా?''

''ఇది ఊరైతే గదా ఉండేదానికి!''

''అయితే మీరంతా ఎట్లుండాఁరా?''

''ఎట్లుండాఁరా అంటే ఎట్లా పోలేకనే! నిజిం సెప్తా ఉండా మామా! ఉండే ఆ నాలుగు గుంటలకయ్య మెడకొక్క గుదిబండే అయిందనుకో. దాన్ని యిడ్సి పెట్టేసి పోలేం. పట్టుకోని ఊగులాడ్తా బతకమంటే ఇంటికూడు దోవకూడు రొండూ తప్పిన బతుకులనుకో. అదే సాకలోడో మంగలోడో అయితేనా? ఈ ఊరు గాకుండాపోతే యింకొక ఊరు. అదీ గాకుండా బోతే ఉండనే ఉండ్లా టవున్లు?''

''నిజిమే అనుకోరా! అయినా తాత ముత్తాతల కాలం నుంచి మనం వాళ్లను వాళ్లు మనల్ను...''

''నమ్ము కోనుంటిమి మామా! కాదన్లేదే. బూమిని నమ్ముకోని ఊరుంటే ఊరిని నమ్ముకోని వాళ్లుండ్రి. నాలుగు సినుకులు. ఈ కార్తిలో రాలకుండా పోతే పాయ్‌నాయి. ఆ కార్తిలో అయినా రాలకుండా పోతాయా? అని ఏడేండ్లుగా ఎదురు చూస్తానే ఉండాం. వొచ్చినట్టే రానట్టే అవ్వి ఎనికెనిక్కి పోతానే ఉండాయి. ఇంక ఈ బతుకు ఎక్కొచ్చేదెప్పుడు? ఎక్కిరాని బతుకుల్తో మా ఎతలు మావి. 'మీ ఎతలేవో మీకుంటే మా బతుకులు మా కుండ్లా?' అని సాకలోళ్లు మంగలోళ్లు ఎవురి దోవ వాళ్లు సూసుకుండ్రి. సత్తింగా సెప్తా ఉండా మామా! ఈ రైతు పుట్టక పుట్టే దానికంటే అట్లాంటి కొంపల్లో అయినా పుట్టుంటే లచ్చణంగా బతికి పొయ్యుండచ్చు. వస్తా మామా! కడతేరి పాయ్‌న కట్టెకత సూడాల గదా!'' – వాడూ యాష్టంతా ఎత్తి నా మింద ఎదచల్లిపాయ!

మా చినయ్య కొడుకు చచ్చినాడనే బాదకంటే ఊళ్లో వాళ్లు చావలేకుండా బతకతా ఉండారే? ఏం బతుకులబ్బా ఈ బతుకులు? అనే బాద పట్టుకుండె. ఆ బాదతోనే మా పాలోడికి చేతల్తో పిడికిడు మట్టేస్తి. గుంటకట్టమింద బస్సెక్కితి. బస్సులో కూలబడ్తే గూడా మణుసు కుదట పళ్లేదే? దాని దోవన అది పోతానే ఉండాది.

ఎట్లా ఉణ్ణె పల్లెలు! రామ రామ! యిట్టయిపాయ్‌నాయే? నీళ్లు అడిగితే నీరు మజ్జిగ యిస్తా ఉణ్ణింది యీళ్లేనా? కాకి కార్‌మంటే చాలు. ఒకరినొకరు కావిలించుకొని కంటికి కడవగా ఏడస్తా ఉణ్ణింది యీళ్లేనా? అవునులే! చావలేక బతకతా.. బతకలేక చస్తా వాళ్ల చావుచదరమై పోతావుంటే మణిసికి మణిసికీ మద్దె మమకారానిగ్గూడా వాళ్లు పాడె కట్టేసినట్టుండాది. లేకుండా బోతే ఆ పలకలోళ్లు తాగేదానికి దుడ్లిచ్చేదాకా పలకమింద దెబ్బ ఎయ్యనంటే ఎయ్యనంటారా? ఏం బతుకులో పాడు బతుకులు? ఆ పల్లె కొంపల్లో అట్లుంటే–

ఈ టవన్లల్లో తాళి గట్టమంటే కూలి. పాడెకట్టాలంటే కూలి. పలక గొట్టాలంటే కూలి. యాడవాలంటే కూలి. ఎత్తాలంటే కూలి!...

ఏం బతుకులో ఎత్తుబారం మొత్తుకోళ్లగా బతుకులు!

ఎప్పుడు దిగినానో రొండు చోట్ల బస్సు దిగినాను. మూడు బస్సులు ఎక్కినాను. సత్తింగా దిగిందీ తెల్లా. ఎక్కిందీ తెల్లా. చావుకు పొయ్యిందిగదా? బతుకు చావు జంపులైపొయ్యింది. కొంప చేరుకుందా మనుకుంటా గబ గబ నడస్తా ఉండా. మణుసు యింకా సోదీనానికి రాలా. వాలిపొయ్న తల పైకి లెయ్‌లా. నాదోవ నాదిగా ఉంటే-

''ఒరే అబ్బోడా!'' అని ఎవురో ఎలుగిచ్చి నట్టుండె!

తలపైకెత్తి చూస్తి. ఎదురుంగా ముత్తారెడ్డన్న.

''ఇప్పుడేరా అబ్బోడా యిప్పుడే! రేడియోలో యినేసి వస్తావుండా. 'పల్లెరా! యిది పల్లెరా! పాడిపంటల ముల్లెరా!' అనేపాట రాసింది నువ్వేగదా?'' అని అడిగె.

నా తల్లి సాచ్చిగా చెప్తావుండా. ఆమాట హవాయి చెప్పుతో కొట్నెట్టు మెత్తగా తగిల్తే వంచిన తల పైకెత్తుంటే ఒట్టు! ●